# తెలంగాణపై కరుణ చూపని నిర్మలమ్మ

## రాష్ట్రానికి దమ్మిడీ విదల్చని ఎన్డీఏ సర్కారు

**అసలు తెలంగాణ పేరు ప్రస్తావనకు రాకపోవడం బాధాకరం**

**బయ్యారం ఊసు లేదు.. ట్రిపుల్ ఆర్ ప్రస్తావన లేదు**

**హైదరాబాద్ ఏఐ సిటీకి నో ఫండ్స్**

**ఫ్యూచర్ సిటీని పట్టించుకోలే.. మెట్రో సెకండ్ ఫేజ్ కు నిధులియ్యలే**



కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు మరోమారు గుండు సున్నా దక్కింది. 2024 మాదిరిగానే 2025 కేంద్ర బడ్జెట్ లో కూడా తెలంగాణకు మరోసారి నిరాశే మిగిలింది. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి 8 ఎంపీ సీట్లు తెలంగాణ ప్రజలు గెలిపించి ఇచ్చినా.. కేంద్రం ఆ కనీస కృతజ్ఞతను మరిచి మరోమారు మొండి చెయ్యే చూపింది. గతేడాది భంగపాటు ఎదురైనా ఈసారైనా తెలంగాణకు విభజన హామీలు, నిధులు దక్కుతాయని ఎదురుచూడగా.. మళ్లీ నిరాశే మిగిలింది.

వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టింది. యథావిధిగా ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలకు ప్రాధాన్యం ఇస్తూనే ఉత్తరాది రాష్ట్రాలకు ఇతోధికంగా నిధులు కేటాయించింది. ఎన్డీఏ సర్కార్ లో కీలక పాత్ర పోషిస్తున్న ఆంధ్రప్రదేశ్ కు భారీ కేటాయింపులు గతంలో మాదిరిగానే దక్షిణ భారతదేశానికి అత్తెసరు కేటాయింపులే జరిగాయి. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి ఒక్కటంటే ఒక్క చెప్పుకోదగ్గ నిధుల కేటాయింపు జరగలేదు. మరోసారి తెలంగాణపై పూర్తిస్థాయి నిర్లక్ష్యం జరిగింది. గతేడాది కేటాయింపుల్లో మాదిరిగానే ఈ ఏడాది అదే ఒరవడి ఈసారి కూడా కొనసాగింది. పద్మ అవార్డుల్లో వివక్ష కొనసాగగా తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్ లోనూ అదే పరిస్థితి కొనసాగింది.కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు జరిగిన కేటాయింపులు చెప్పుకోవడానికి ఏమీ లేదు. ఒక జిల్లాకు.. ఒక పథకంలో కూడా తెలంగాణకు ప్రాధాన్యం దక్కలేదు. ఒకవిధంగా చెప్పాలంటే కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ పేరు అనేదే వినిపించలేదు. అంతగా తెలంగాణపై కేంద్ర వివక్ష కొనసాగింది.ఏ విషయంలోనూ బడ్జెట్ లో తెలంగాణ పేరు ప్రస్తావనకు రాలేదు.

పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కు అపారంగా నిధులు.. ప్రాజెక్టులు లభించగా తెలంగాణ అనే పేరు కనుమరుగైంది. ఈ అంశంపై రాజకీయ పార్టీలు తీవ్ర విమర్శలు చేస్తుండగా.. ప్రజలు కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇక కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కూడా బడ్జెట్ లో తెలంగాణకు దక్కిన ఫలితాలు ఏమిటో కూడా చెప్పుకోలేని పరిస్థితి. ఆయన ఏవేవో లెక్కలు తీసి చివరకు రూ.పది వేల కోట్ల కేటాయింపులు చేసినట్లు కవరింగ్ చేశారు. కానీ ఆయన చెప్పిన లెక్కలన్నీ యథావిధిగా రాష్ట్రానికి దక్కాల్సిందే. ఆయన చెప్పిన లెక్కలు న్యాయపరంగా తెలంగాణకు రావాల్సినవి మినహా ప్రత్యేకంగా కేటాయించినవి కావు. ఇక కేంద్ర బడ్జెట్ పై తెలంగాణ నుంచి ఉన్న మరో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ నామమాత్రం కూడా స్పందించలేదు.

**ఇద్దరు కేంద్ర మంత్రులున్నా వచ్చింది సున్నా**

బడ్జెట్ లో తెలంగాణ దమ్మిడీ విదిల్చలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు మార్లు వెళ్లి ప్రధాన మంత్రిని, కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి రూ. 1.65 లక్షల కోట్ల పనులకు ప్రతిపాదనలు పంపితే ఒక్క రూపాయి కూడా విదిల్చకపోవడం గమనార్హం. మూడు ఏఐ సిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అందులో హైదరాబాద్ పేరు లేకపోవడం నిరాశకు గురి చేసింది. నిర్మలా సీతారామన్ స్పీచ్ లో బయ్యారం స్టీల్ ప్లాంట్, హైదరాబాద్– నాగ్ పూర్ కారిడార్, మెగా లెదర్ పార్కు అంశాలను ప్రస్తావించలేదు. మెట్రో రెండో దశ విస్తరణకు నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధాన మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని కూడా కేంద్రం అటకెక్కించింది.ముచ్చర్లలో ఏర్పాటు చేయబోయే ఫ్యూచర్ సిటీకి నిధులు ఇవ్వలేదు. దీంతో పాటు ఎన్నో ఏండ్లుగా పెండింగ్ లో ఉంటున్న పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించడంతోపాటు నిధులు ఇవ్వాలని కోరినా కేంద్రం పట్టించుకోలేదు. ఐటీఐఆర్ ను అటకెక్కించింది.నదుల అనుసంధానాన్ని కీలకమైన అంశంగా భావిస్తున్న కేంద్ర ప్రభుత్వం మూసీ–గోదావరి లింకేజీకి నిధుల అంశాన్ని బడ్జెట్ లో ప్రస్తావించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా ఒక్క రూపాయి కూడా తేలేక పోయారనే విమర్శలు వస్తున్నాయి.

**మరీ ఇంత అన్యాయమా..?**

లోక్ సభలో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు కొత్తగా దక్కిందంటూ ఏమీ లేకపోగా, బీహార్ అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా ఆ రాష్ట్రానికి కేంద్రం బడ్జెట్ లో భారీగా నిధులు కేటాయించడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్లు పెంచాలని తెలంగాణ ప్రభుత్వం గట్టిగానే కోరినా బడ్జెట్ లో ఆ దిశగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

కేంద్రం నుంచి సుమారు రూ.30 వేల కోట్లను గ్రాంట్ల రూపంలో తెలంగాణకు ఇవ్వాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను కేంద్రం పెద్దగా పట్టించుకోలేదు. ప్రభుత్వ పథకాలు సవ్యంగా అమలయ్యేందుకు, నిధులు లేమితో పథకాల అమలులో జాప్యం జరగకుండా ఉండేందుకు రేవంత్ సర్కార్ కేంద్రాన్ని గ్రాంట్లను కోరింది. 2024-25 రాష్ట్ర బడ్జెట్ లో కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లను రూ.21,636 కోట్లుగా ప్రభుత్వం చూపింది. అయితే.. గత 9 నెలల్లో కేవలం రూ.4,771 కోట్లు మాత్రమే కేంద్రం నుంచి తెలంగాణకు గ్రాంట్ల రూపంలో వచ్చాయి. ఎప్పట్లాగే కేంద్ర పన్నుల్లో రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన వాటా, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద వచ్చే నిధులే తప్ప ప్రత్యేకంగా కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు దక్కిందేమీ లేదు. హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ, స్కిల్స్, స్పోర్ట్స్ వర్సిటీ, ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవం సహా పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులు కోరింది.

బడ్జెట్ చూశాక.. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను కేంద్రం పరిగణనలోకి తీసుకున్న దాఖలాలు కనిపించలేదు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు కోసం తెలంగాణ ప్రభుత్వం కేంద్రం నుంచి రూ.14 వేల కోట్ల ఫండింగ్ కోరింది. దశలవారీగా అయినా ఈ నిధులను కేటాయిస్తే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు ముందుకు వెళుతుందని తెలంగాణ ప్రభుత్వం ఆశించింది.

- కీలక ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులకు నిధులు ఆశించి తెలంగాణ భంగపడింది. హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్, మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు, మెట్రో రైలు విస్తరణకు బడ్జెట్ లో నిధులు ఆశించగా నిరాశే మిగిలింది.
- ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం.. తెలంగాణకు దక్కాల్సిన నిధులను ప్రభుత్వం ఆశించగా కేంద్ర బడ్జెట్ లో ఆ ప్రస్తావనే లేకపోవడం గమనార్హం.
- గోదావరి నదీ జలాలకు సంబంధించి కేంద్రం ముందు తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రతిపాదన ఉంచింది. హైదరాబాద్ నగరంలో తాగునీటికి రానురానూ డిమాండ్ పెరుగుతుందని, గోదావరి జలాలను తరలించడంతో పాటు మూసీ నది జలాలను శుద్ధి చేస్తే ఈ సమస్య తలెత్తకుండా ఉంటుందని కేంద్రానికి ప్రభుత్వం తెలిపింది. ఈ అంశాన్ని కూడా కేంద్రం పట్టించుకోలేదు.
- హైదరాబాద్ చుట్టూ రీజినల్‌రింగ్‌రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్)కు చేయూత, మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్టుకు ఆర్థిక సాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అడిగినా కేంద్రం ఈ ప్రతిపాదనలను పెడ చెవిన పెట్టింది.
- సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వలేదు. సమ్మక్క-సారక్క జాతరకు కూడా జాతీయ హోదా ప్రకటించలేదు. సుదీర్ఘకాలంగా తెలంగాణ ప్రజలు డిమాండ్ చేస్తున్న ఐఐఎం సంస్థ ఏర్పాటును కేంద్ర ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకపోవడం దారుణం. ఉపాధి హామీ పథకానికి గత నాలుగు సంవత్సరాల నుంచి ఒకే మొత్తంలో నిధులు కేటాయిస్తుంది, కనీసం ఈ ఏడాది కూడా ఉపాధిహామీకి నిధులు పెంచకపోవడం శోచనీయం. తెలంగాణకు ఐఐటీ, ఐఐఎం, ఐసర్, ఎన్ఐడీ, ట్రిపుల్ ఐటీ వంటి ఉన్నత విద్యాసంస్థల్లో ఏదీ ఇవ్వకపోవడం ఇక్కడి విద్యార్థులకు, యువతకు, వారి తల్లిదండ్రులకు తీవ్ర అన్యాయం చేయడమే.
- ఏటా కేంద్రం నుంచి పన్నుల వాటాతో పాటు ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లు, సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్‌ల నిధులు రాష్ట్రాలకు అందుతాయి. కేంద్రం అమలు చేస్తున్న పథకాలకు సంబంధించి రాష్ట్రాలకిచ్చే సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్ (సీఎస్ ఎస్) నిధులు వస్తాయి. ఇవి దేశంలోని ప్రతీ రాష్ట్రానికి కేంద్రం నుంచి అందేవే. కొత్తగా తెలంగాణకంటూ కేంద్రం బడ్జెట్ లో చేసిన మేలు ఏం లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే.. కేంద్ర బడ్జెట్ 2025లో తెలంగాణకు దక్కింది గుండు సున్నా.

**మధ్యతరగతికి ఊరటనిచ్చే బడ్జెట్..**

గత మూడు నాలుగేళ్లుగా మోడీ సర్కార్ ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తోంది ఈ బడ్జెట్ లోనూ అదే కనిపించింది. 9.5 శాతానికి వెళ్లిన ద్రవ్యలోటును ఇప్పుడు కేంద్రం 4.48 శాతానికి తీసుకువచ్చింది. అలాగే వచ్చే ఏడాది కల్లా 4.4 శాతానికి ద్రవ్యోల్బణం తగ్గిస్తామని ప్రతిపాదించింది. అలాగే ప్రజలపై పన్నుల భారం పెంచకుండా తగ్గించడం కూడా బడ్జెట్ లో మరో హైలెట్. . నూటికి 98 శాతం మందిపై ఆదాయపు పన్ను ప్రభావం లేకపోవడం గొప్ప విషయం.

రాష్ట్రాలకు లక్షా 50 వేల కోట్లు 50 ఏళ్లకు వడ్డీ లేని రుణాలు ఇస్తామనడాన్ని కూడా స్వాగతించాల్సిన విషయమే. చాలా ముందుచూపుతో, ఆర్థిక క్రమశిక్షణతో తీసుకున్న నిర్ణయం.. బడ్జెట్లో అంకెల గారడీ కూడా లేదు. రాష్ట్రాలకు ఇచ్చే నిధుల వాటాను కూడా కొనసాగించారు. జాతీయ స్థాయిలో సొంత ఆదాయం 48 లక్షల 37 వేల కోట్లు ఉండగా ఇందులో 53 శాతం రాష్ట్రాలకు ఇస్తున్నారు.. వ్యవసాయం, చిన్న పరిశ్రమల గురించి ఆలోచించారు. పట్టణాల్లో మౌలిక సదుపాయాల పెంపు, వ్యవసాయ అనుబంధ రంగాల ఆదాయం పెంపు వంటివి మంచి నిర్ణయాలు. 25 లక్షల కోట్ల రూపాయలు రాష్ట్రాలకు కేంద్రం బడ్జెట్ లో కేటాయించింది.. ఏపీకి ప్రత్యేకంగా ఏమీ రాకపోయినా మిగతా వారితో పోలిస్తే సమానంగానే వచ్చింది.





- డాక్టర్ కాచం సత్యనారాయణ
వీ3 న్యూస్, విశ్వంభర తెలుగు దిన పత్రిక
ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్

# తెలుగు సినిమా కీర్తిని విశ్వవ్యాపితం చేసిన కళాతపస్వి కె.విశ్వనాథ్


**కె.విశ్వనాథ్ తీసిన ప్రతి సినిమా ఒక ఆణిముత్యమే. ప్రతి చిత్రం ఒక కళాఖండమే. ఎప్పటికీ నిలిచిపోయే పాత్రలు, వినసొంపైన సంగీతం, అర్థవంతమైన మాటలతో ఆయన తీసిన ప్రతి సినిమా ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. ఆయన సినిమాల్లో మీకు ఏది ఇష్టం అని ఎవరినైనా అడిగితే.. ఠక్కున ఒకటి చెప్పడం చాలా కష్టం. ఎందుకంటే ప్రతి సినిమా అజరామర కీర్తిని సాధించింది.**

**లెజెండరీ డైరెక్టర్ కె.విశ్వనాథ్ సినీ పరిశ్రమకు ఆణిముత్యాల్లాంటి చిత్రాలను అందించారు. సామాజిక సమస్యలు, సాంఘిక దురాచారాలను సునిశితంగా విమర్శిస్తూ చిత్రాలు రూపొందించిన కె విశ్వనాథ్.. తన సినిమాల్లో ప్రధానంగా కళలకు పెద్ద పీట్ వేశారు. ఆయన తెరకెక్కించిన మెజారిటీ చిత్రాలు కళలకు సంబంధించినవే. ఆయన చెప్పాలనుకున్న కథకు సంగీతం లేదా నృత్యాన్ని జోడించి అందమైన దృశ్యరూపంగా మలచడంలో ఆయనకు ఆయనే సాటి. 'శంకరాభరణం, సాగర సంగమం, సిరి సిరి మువ్వ, స్వర్ణ కమలం' తదితర చిత్రాలు ఈ కోవకు చెందినవే.**



నేడు ఆయన వర్ధంతి





గుంటూరు జిల్లా రేపల్లె తాలూకాలోని పెద పులివర్రు అనే గ్రామంలో 1930 ఫిబ్రవరి 19న కాశీనాథుని విశ్వనాథ్ జన్మించారు. బాల్యం, ప్రాథమిక విద్య పెదపులివర్రులోనే గడిచినా ఆ ఊర్లో ఎక్కువ రోజులు నివసించలేదు. విశ్వనాథ్ పాఠశాల విద్య అంతా విజయవాడలో చేశారు. గుంటూరు హిందూ కాలేజీ, ఏసీ కాలేజీల్లో కాలేజీ విద్య పూర్తి చేశారు. బీఎస్సీ డిగ్రీ పట్టా తీసుకున్నారు. విశ్వనాథ్ బీఎస్సీ పూర్తైన వెంటనే వారాహి స్టూడియోలో 1957లో తోడికోడళ్లు సినిమాకు సౌండ్ ఇంజనీర్‌గా పనిచేశారు. అలాగే, ఎన్టీఆర్ హీరోగా రూపొందించిన పాతాళ భైరవి, పెళ్లి చేసి చూడు, మాయాబజార్ వంటి చాలా సినిమాలకు సౌండ్ విభాగంలో పనిచేశారు. ఇక ఎంతో ఓపికగా పనిచేసేవారు విశ్వనాథ్. దీంతో ఆయన పనితనం మెచ్చి దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు విశ్వనాథుకు సహాయ దర్శకుడిగా అవకాశం ఇచ్చారు. విశ్వనాథ్‌కు మూగమనసులు, డా, చక్రవర్తి సినిమాలు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారు.

ఆ తర్వాత విశ్వనాథ్‌ను అదృష్టం వరించింది. ఆయన అసిస్టెంట్ డైరెక్టర్ నుంచి దర్శకుడిగా మారారు. అక్కినేని నాగేశ్వర్ రావు హీరోగా ఆత్మగౌరవం సినిమా ద్వారా విశ్వనాథ్ దర్శకుడిగా పరిచయం అయ్యారు. ఆ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేక పోయింది.ఈ చిత్రానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నంది బహుమతి లభించింది. ఆ తర్వాత చిన్న చిన్న సినిమాలు తీసుకుంటూ వస్తున్న సమయంలో సిరిమమువ్వలు ఆయన జీవితాన్నే మార్చేసిందని చెప్పాలి.

సిరిమువ్వలు సినిమా ద్వారా దర్శకుడిగా ఆయన ప్రతిభను అందరూ గుర్తించారు. తర్వాత నిండు హృదయాలు, స్వాతి ముత్యం, శృతిలయలు, శంకరాభరణం, సాగరసంగమం, స్వర్ణకమలం, సప్తపది, స్వాతిముత్యం, స్వయంకృషి, శుభలేఖ, ఆపద్బాంధవుడు, శుభసంకల్పం వంటి ఎన్నో క్లాసిక్స్ అందించారు. అలాగే, నటుడిగానూ ఎన్నో గొప్ప పాత్రల్లో కె.విశ్వనాథ్ జీవించారు.

శంకరాభరణానికి జాతీయ పురస్కారంతో పాటు సప్తపదికి జాతీయ సమగ్రతా పురస్కారం లభించింది. ఎన్నోగొప్పసినిమాలకు పురుడు పోసి దిగ్గజ నటుడిగా మంచి పేరు సంపాదించుకున్నారు. 60సినిమాలకు దర్శకత్వం వహించడమే కాకుండా విశ్వనాథ్ తన నటనతోను తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. కేవలం దర్శకుడిగానే కాకుండా నటుడిగా కూడా తన సత్తాచాటాడు. శుభసంకల్పం సినిమాతో తొలిసారి వెండితెరపై కనిపించిన కె.విశ్వనాథ్.. వజ్రం, కలిసుందాంరా, నరసింహనాయుడు, సీమసింహం, నువ్వులేక-నీను లేను, అతడు, ఆంధ్రుడు, స్వరాభిషేకం సంతోషం, లాహిరి లాహిరి లాహిరిలో, ఠాగూర్ వంటి పలు సినిమాల్లో మంచి పాత్రలతో మెప్పించారు. సినీరంగానికి ఆయన చేసిన కృషిగానూ ఎన్నో అవార్డులను కె.విశ్వనాథ్ అందుకున్నారు. 1992లో రఘుపతి వెంకయ్య పురస్కారం అందుకున్నాడు. కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. 2016లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు కూడా వచ్చింది. స్వాతిముత్యం సినిమా 1986లో ఆస్కార్ అవార్డుకు అధికారికంగా ప్రవేశం పొందింది. 92 ఏళ్ల కె. విశ్వనాథ్ వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాదులోని అపోలో ఆస్పత్రితో చికిత్స పొందుతూ 2023 ఫిబ్రవరి 2న శివైక్యం చెందారు.